## క్లుప్తంగా

### ప్రజాకవి దాశరథి సేవలు నిరుపమానం



తెనాలిటౌన్: ప్రజాకవి దాశరథి కృష్ణామాచార్యులు కలం నుంచి, గలం నుంచి బయటపడ్డ ప్రతి అక్షరం జనంలో చైతన్యం నిలిపిందని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు ఎ.రామారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో దాశరథి కృష్ణామాచార్యులు 100వ జయంతి ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి, ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రతి అక్షరం అభ్యుదయ భావాలను ఆదర్శవంతంగా నిలిచిందని, సమాజంలో నెలకొన్న రుగ్మతులపై కవిత్వం అలంబనగా దాశరథి పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో తాడికొండ జగన్మోహనరావు, శ్రీదేవి, ఎంవీ.రఘునాథరావు, నాగం రమేష్, కె.విజయ సారథిబాబు, వి.భువనేశ్వర ప్రసాద్, బెజ్జంకి నాగమణి, విజయలక్ష్మి, విజయదుర్గా, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

### అసోసియేషన్ నగదు గోల్‌మాల్‌పై ఫిర్యాదు



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు సంబంధించిన నగదు దుర్వినియోగం అయిందంటూ అసోసియేషన్ సభ్యులు మంగళవారం పట్టణ వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావుకు ఫిర్యాదు చేశారు. సభ్యత్వం, తదితర సంబంధిత నిధులు దాదాపు రూ. 2 లక్షలు దుర్వినియోగం అయిందని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కె.సునీల్ సందీప్, కుర్రా అంక మహేష్, మణికాంత్ బాబీ తదితరులు ఉన్నారు.

### అగ్నిప్రమాదంలో గేదె మృతి



తెనాలిరూరల్: అగ్నిప్రమాదంలో గేదె మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి పొద్దుపోయాక తెనాలిలో చోటు చేసుకుంది. స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం పాఠశాల వెనుక బజారులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. పశువులు చావిడికి నిప్పు అంటుకోవడంతో తీవ్ర కాలిన గాయాలతో ఒక పశువు మృతి చెందినట్లు యజమాని మల్లేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పశువులశాలలో ఫ్యాన్లకు బిగించిన తీగలు షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో ప్రమాదం సంభవించినట్లు యజమాని చెబుతున్నాడు. అగ్నిమాపక కేంద్ర సిబ్బంది ఘటనా ప్రదేశానికి చేరుకుని విస్తరించిన మంటలను అదుపులోకి తెచ్చినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో మరో ఐదు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. పశు సంవర్ధక శాఖ ఏడీ జి. నరేంద్ర బాబు అద్వర్యంలో గాయపడిన పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. మరో పశువు పరిస్థితి విషమంగా ఉందన్నారు.

### ఆగస్టు 4న ఏజెంట్ల ఎంపిక

తెనాలిఅర్బన్: తపాలాశాఖ ఆధ్వర్యంలో జీవిత బీమా పాలసీలను సేకరించేందుకు ఏజెంట్ల ఎంపికను ఆగస్టు 4న నిర్వహించనున్నట్లు తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ కొత్తపేటలోని హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో జరుగుతుందన్నారు. పదోవ తరగతి పాసై 18 సంవత్సరాలు నిండినవారు అర్హులని చెప్పారు. ఇంటర్వ్యూలకు వచ్చే వారు బయోడేటాతో పాటు ఎస్ఎస్‌ఈ సర్టిఫికెట్, ఆధార్, పాన్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని వివరించారు. వివరాలకు దగ్గరలో ఉన్న పోస్టాఫీసులో, సెల్ నెంబర్ 9493241466 లో సంప్రదించాలన్నారు.

### ఎక్కువ చార్జీలు విధించారని పసుపు రైతుల ఆవేదన



దుగ్గిరాల: తమను ప్రభుత్వం ఆదుకుంటామని చెప్పి పూర్తి మొత్తంలో నష్ట పరిహారం ఇవ్వకుండా.. పాక్షికంగా నగదు విడుదల చేయడంపై పసుపు రైతులు అసంతృప్తి చెందారు. దుగ్గిరాలలో మంగళవారం బాధిత పసుపు రైతులు తమ బాధను వ్యక్త పరిచారు. బాధిత పసుపు రైతు కొమ్మారెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. అగ్ని ప్రమాద సమయంలో 344 పసుపు బస్తాలు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేయగా.. ఒప్పందం ప్రకారం రావాల్సిన మొత్తం రూ.30 లక్షలు ఉండగా కేవలం రూ.10 లక్షలు మాత్రమే లెక్క చెబుతున్నారని వాపోయాడు. కార్యక్రమంలో రైతులు జాస్తి రామాంజనేయులు, కొంగర శేషుబాబు, అంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘సూపర్ సిక్స్’ ఆశలు కల్పించి.. గెలిచారు

- అధికారంలోకి వచ్చాక అసలుకే మోసం చేశారు
- ఇప్పుడేమో బటన్ నొక్కుతామని ఓట్లు వేయలేదంటున్నారు
- ఆడబిడ్డలకు నెలకు రూ.1500 ఎలా ఇస్తాం అంటున్నారు
- ప్రజలను అపహాస్యం చేస్తున్న రాష్ట్ర మంత్రుల వ్యాఖ్యలు
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్



క్యూ ఆర్ కోడ్ పోస్టరును ఆవిష్కరించిన శివకుమార్, పార్టీ నేతలు

తెనాలి: గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాల హామీలను గుప్పించిన కూటమి పార్టీల నాయకులు అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా సంక్షేమం ఇవ్వకుండా అసలుకే మోసం చేశారని వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విమర్శించారు. పైగా ఇప్పుడు రాష్ట్ర మంత్రులు చిత్రమైన వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై రూరల్ మండలంలోని పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకుల సమావేశాన్ని మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. రూరల్ మండల అధ్యక్షుడు చెన్ను బోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు.

#### జగనన్న హయాంలో నేరుగా నగదు జమ

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, వివిధ సంక్షేమ పథకాలతో ప్రజల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేసినట్టు గుర్తుచేశారు. అంతకన్నా ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి పార్టీల నేతలు హామీనిచ్చినట్టు గుర్తుచేశారు. కొద్దిరోజుల క్రితం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, 'బటన్ నొక్కుతామని చెప్పి ప్రజలు మాకు ఓటేయలేదు' అని చెప్పటాన్ని శివకుమార్ గుర్తుచేశారు.

#### డబ్బులివ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలంటున్నారు!

మళ్లీ ఈరోజు మరో మంత్రి అచ్చెన్నాయుడు, 'ఆడపిల్లలకు నెలకు రూ.1500 చొప్పున ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాల్సి వస్తుంది' అనటం చూస్తుంటే ఏమనాలో అర్థం కావటం లేదన్నారు. యాభై ఏళ్లకు పింఛను హామీ సంగతటుంచితే 60 ఏళ్లు నిండిన వేలాది అర్హులకు కొత్తగా ఒక పింఛను కూడా ఇవ్వలేదన్నారు. సంక్షేమంతోపాటు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, నాడు–నేడుతో పాఠశాల భవనాలను నిర్మించినట్టు గుర్తుచేశారు.

#### అభివృద్ధి జాడెక్కడా?

సంక్షేమం అందించలేని కూటమి ప్రభుత్వం కనీసం అభివృద్ధి పనుల సైతం చేపట్టటం లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన ఆర్థికలాభం, కూటమి ప్రభుత్వ హామీలు అమలుచేయనందున జరిగిన ఆర్థికనష్టంపై ప్రతి ఇంటికీ వివరించాలని సూచించారు. తెనాలి జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా యాక్టివిటీ కార్యదర్శి తాడిబోయిన యలమంద, రూరల్ మండల యువజన అధ్యక్షుడు కుర్రా జస్వంత్‌యాదవ్, బీసీ సెల్ అధ్యక్షుడు కమాదుల స్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పినపాటి రవికిరణ్, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కుదరవల్లి శంకర్, మైనారిటీ అధ్యక్షుడు షేక్ ఖాజా పాల్గొన్నారు.

### పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్వా యేసుబాబు



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్వా యేసుబాబు పేర్కొన్నారు. గురవయ్య కాలనీ, పూలేకాలనీల్లో మంగళవారం ఆయనపర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుధ్యనిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. తరచూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

## కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఏవో సుధీర్‌బాబు



రైతులతో మాట్లాడుతున్న ఏవో సుధీర్‌బాబు

తెనాలిటౌన్: వెద సాగు చేపట్టిన రైతులు పొలంలో కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు సూచించారు. మంగళవారం రూరల్ మండలం బుర్రిపాలెం, జగ్గడిగుంటపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిసాగుగా వెద పద్ధతి చేపట్టిన పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాభావం వలన పొలంలో నీరు నిల్వ ఉన్నందున్నా బయటకు పంపే చర్యలు చేపట్టాలని వివరించారు. వెద పద్ధతిలో కలుపుయాజమన్య పద్ధతులు పాటించాలని స్పష్టం చేశారు. విత్తనం విత్తిన ఒకటి, రెండు రోజుల లోపు భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు కలుపుమందును పిచికారీ చేయాలని తెలిపారు. దీనివలన అన్ని రకాల కలుపు మొక్కలను మొలకెత్తకుండా నిర్మూలించవచ్చని అన్నారు. రైతులు పంటలను ఈ–క్రాఫ్ చేయించుకోవాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జగ్గడిగుంటపాలెం సర్పంచ్ కుంభం బాలాజీ, ఉద్యానవనశాఖ హెచ్‌వో శ్రీవిద్య, బుర్రిపాలెం సర్పంచ్ పరుచూరి విజయలక్ష్మి, వ్యవసాయశాఖ ఏఈవోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

## రైతులు పంట నమోదు చేయించుకోవాలి

ఏవో శ్రీనివాసరెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరెడ్డి

తూములూరు(కొల్లిపర): ప్రతి రైతు సాగు చేస్తున్న పంటలను ఆయా గ్రామాలలోని వ్యవసాయ సిబ్బంది ద్వారా పంట నమోదు (ఈ–క్రాప్) కౌలుకు సాగు చేస్తున్న కౌలు రైతులు తప్పని సరిగా రెవెన్యూ శాఖ ద్వారా కౌలు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి సూచించారు. మండల పరిధిలోని తూములూరు, దావులూరు గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ కౌలు రైతులు కౌలు కార్డులు పొందటం వలన ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమం పొందడానికి, పంట దిగుబడి ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవచ్చు, బ్యాంకు నుంచి కూడా రుణాలు పొందే అవకాశాలు ఉన్నాయి అని తెలిపారు.

అనంతరం ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం ఎలా తయారు చేసుకోవాలి, జీవామృతం వలన పంటలకు కలుగు ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### బీజేపీ కిసాన్ మోర్చ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు



తెనాలిటౌన్: మండల పరిధిలోని నందివెలుగు గ్రామ కిసాన్‌మోర్చ అధ్యక్షునిగా బి.కోటేశ్వరరావు నియమితులయ్యారు. మంగళవారం రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు అధ్యక్షతన గ్రామ కిసాన్‌మోర్చ కమిటీ నియామకం జరిగింది. అధ్యక్షునిగా బి.కోటేశ్వరరావును ఎంపిక చేసి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కె.రామస్వామి, కె.సుందరం, ధూళిపాళ్ళ శేషయ్య, గ్రంథి రాములు, బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

### అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



తెనాలిఅర్బన్: తెనాలి జిల్లావైద్యశాలలో చికిత్సపొందుతూ మృతి చెందిన అనాథ మృతదేహానికి శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. సుమారు 55 సంవత్సరాలు ఉన్న వ్యక్తి అనారోగ్యంతో వైద్యశాలలో మృతి చెందారు. త్రీటౌన్ పోలీసులు విజ్ఞప్తి మేరకు సమితి సభ్యులు బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు మహాప్రస్థాన సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్, సభ్యులు మల్లెల వాసు, పోతురాజు, ఎస్.రాంబాబు, పి.నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ అలీంబాషా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రానున్న రెండు, మూడు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. నగర పరిధిలో రత్నాల చెరువు, పావురాల కాలనీ, తాడేపల్లిలోని లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే నగర పాలక సంస్థలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 08645 295193, 7093912653 ద్వారా సహాయం పొందవచ్చని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## ఉద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం



మానవహారంలో పాల్గొన్న ఉద్యోగులు

తెనాలిఅర్బన్: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం నుంచి కొద్దిసేపు ఆందోళన చేశారు. అనంతరం మార్కెట్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు రోజుల నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కంటి తుడుపు చర్యలకు దిగడం బాధాకరమన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కేవలం మూడు కేటాగిరిల కింద వేతనాలు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం విస్మయాన్ని గురి చేసిందన్నారు. ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరికి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు మద్దతు తెలిపారు.

కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.పద్మ, పి.జయలక్ష్మి, దార్ల పద్మ, కె.సుశీల, వి.లక్ష్మీనారాయణ, గోపి, సుజాత, షేక్ హుస్సేన్‌వలీ, మరియమ్మ, దుర్గాప్రసాద్, సుధాకర్, ముఠా కార్మిక సంఘ నాయకులు జి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

## శరీరంలో అత్యంత శక్తివంతమైనది మెదడు



మాట్లాడుతున్న వెంకట రమణ

తెనాలిఅర్బన్: మనిషి అవయవాల్లో అత్యంత శక్తివంతమైనది మెదుడు అని, దీనివలనే మనిషి ఆలోచనలు పుడుతూ ఉంటాయని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకట రమణ పేర్కొన్నారు. వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బుర్రిపాలెం రోడ్డులోని అన్నాబత్తుని సత్యనారాయణ ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మ డీ విద్యార్థిని కె.కీర్తి మాట్లాడుతూ మెదడు ద్వారా జ్ఞాపకశక్తి, భావోద్వేగాలు, నడక, పనిచేయడం మొదలైన వాటన్నింటినీ చేయగలుగుతున్నామని తెలిపారు. మనస్సు ఆరోగ్యంగా ఉంచడంలో ఇది ఎంతో ఉపయోగడపతుందున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం మెదడు చురుగ్గా పనిచేస్తుందని చెప్పారు. సమావేశంలో చాప్టర్ మెంబర్ పి.భార్గవి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## • కదలనంటున్న మురుగు కాల్వలు



మూడోవ వార్డు సిద్ధార్థ కాలనీ చివరి రోడ్డులో మురుగు కాల్వలు అధ్వానంగా తయారయ్యాయి. నెలరోజుల నుంచి వీటిని ఎవరూ బాగు చేయక పోవడం వలన పారుదల నిలిచిపోయి మురుగంతా రోడ్లపై చేరుతోంది. దీనివలన దుర్వాసన వస్తోంది. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఆవుల కోటయ్య కోరారు.

– తెనాలిఅర్బన్

## కార్మికుల సమస్యను పరిష్కరించాలి



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 231 రోజులుగా కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని అన్నారు.

కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, సాంబశివరావు, ఇస్మాయిల్, హగ్గయ్య, కార్మికులు నవనీతమ్మ, రమణమ్మ, శారదమ్మ, రిబ్కా, కాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని వేముల దుర్గారావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం వద్ద హాజరైన కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం సమ్మె సందర్భంగా తీసుకున్న ఒప్పందాల జీవోలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ రాజధాని డివిజన్ నాయకులు ఎం.రవి, రూరల్ నాయకులు పల్లె కృష్ణ, డేవిడ్, సంతోషం, కార్మికులు వెంగమ్మ, సతీష్, రాంబాబు, అనూష, శశికళ, శ్రీలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మంగళగిరి: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కమ్యూనిష్టు పార్టీ నాయకులు కోరారు. మంగళవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను ప్రతి కుటుంబం వ్యతిరేకించాలన్నారు. సీపీఎం, సీపీఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో స్మార్ట్ మీటర్ల కారణంగా ప్రజలపై మరింత భారం పడుతుందన్నారు. ఇప్పటికే ట్రాఅప్ ఛార్జీల పేరుతో ప్రజలను దోచుకుంటున్న ప్రభుత్వం ఇప్పుడు స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీ చేసేందుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాశం రామరావు, చిన్ని తిరుపతయ్య, పిల్లలమర్రి నాగేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, ఉడతా శ్రీనివాసరావు, ఎస్.చెంగయ్య, జేవీ రాఘవులు, వై.కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించడానికి వస్తే వినియోగదారులు ప్రతిఘటించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అన్నారు. మంగళవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో సీపీఎం, సీపీఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీపీఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్ అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు పాల్గొని మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ వినియోగదారులకు పెద్ద ప్రమాదం ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నందం బ్రహ్మేశ్వరరావు, జేవీ రాఘవులు, వై.కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

## పని భారాన్ని తగ్గించాలని కోరుతూ వినతి

మంగళగిరి టౌన్: అంగన్‌వాడీలపై పని భారాన్ని తగ్గించాలని కోరుతూ మంగళవారం సీడీపీవోనకు యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అన్ని యాప్‌లకు కలిపి ఒకే యాప్‌గా తీసుకురావాలని గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని కోరుతున్నామన్నారు. అంగన్‌వాడీలకు వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ సీడీపీవోనకు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి హేమలత, గౌరవ అధ్యక్షులు వేముల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

### నార్త్ జోన్ డీఎస్పీ కార్యాలయం మార్పు

మంగళగిరి: పట్టణంలోని రాజీవ్ సెంటర్‌లోని నార్త్ జోన్ డీఎస్పీ కార్యాలయాన్ని జాతీయ రహదారి పక్కన ఉన్న కొండపనేని టౌన్‌షిప్‌నకు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. కొండపనేని టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో ప్రజలు తమ సమస్యలను రోజులో ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజలకు అధికారులు, సిబ్బంది ఎప్పుడూ అందుబాటులోనే ఉంటారన్నారు. కార్యక్రమంలో నార్త్ జోన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### రహదారిపై ట్రాఫిక్ జామ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సెంటర్ నుంచి బైపాస్ రోడ్‌కు వెళ్లే మార్గంలో పశువుల హాస్పటల్ వద్ద బకింగ్‌హామ్ కెనాల్‌పై ఉన్న బ్రిడ్జిపై మంగళవారం రాత్రి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎదురెదురుగా రెండు కార్లు వచ్చాయి. అది సింగిల్ బ్రిడ్జి కావడంతో కార్లలో ఉన్నవారు 'నువ్వు వెనక్కి వెళ్లాలంటే.. నువ్వే వెనక్కి వెళ్లాలంటూ వాదించుకున్నారు. సుమారు 15 నిమిషాల పాటు ఇద్దరూ వాదనలు పెట్టుకోవడంతో అటు బైపాస్‌రోడ్డు, ఇటు వైఎస్సార్ సెంటర్ వైపు భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులు బలవన్మరణం

- భార్యపై కోపంతో ఉరి వేసుకుని ఒకరు
- అప్పుల బాధ తాళలేక మరొకరు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెనుమాక, చిర్రావూరులో వేరువేరు కారణాల వల్ల ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు ఆలస్యంగా వెలుగు చూశాయి. తాడేపల్లి పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. పెనుమాకలో ఫొటో గ్రాఫర్ వృత్తి చేస్తూ జీవిస్తున్న చరణ్(21) అదే గ్రామానికి చెందిన చిన్నారిని 9 నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరు తరచూ గొడవలు పడుతున్నారు. ఈనెల 19వ తేదీన జరిగిన గొడవ కారణంగా చిన్నారి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో చరణ్ ఇంట్లో ఉరి వేసుకున్నట్లు బంధువులు గుర్తించారు. దుగ్గిరాల మండలం పెరికలపూడిలో ఒంటరిగా నివాసం ఉంటున్న తోట వెంకటేష్(22) అప్పు ఇచ్చిన వారి వేధింపులు తాళలేక రెండు రోజుల క్రితం చిర్రావూరులోని పంట పొలాల్లో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనపై మృతుడి మేనమామ శివగంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.